వినతి పత్రం అందజేస్తున్న సిరిసిల్ల నిర్వాసితులు

జాతీయ రహదారి అలైన్ మార్చండి

బండి సంజయ్‌కు నిర్వాసితుల విజ్ఞప్తి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల, దుద్దెడ జాతీయ రహదారి అలైన్ మార్చాలని భూ నిర్వాసితులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల పట్టణం, తంగళ్లపల్లి మండలానికి చెందిన భూ నిర్వాసితులు బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సిరిసిల్ల, సిద్దిపేట మీదుగా దుద్దెడ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి వంకరటింకరగా ఉందని, అందులో తమ భూములు పోతున్నందున అలైన్ మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని కోరారు. రహదారి అలైన్‌మెంట్‌ను పరిశీలిస్తే కొందరికి లబ్ధి చేకూరేలా రూపొందించారని పేర్కొన్నారు. పట్టాభూములు పోతున్న తమకు న్యాయం జరిగేలా అలైన్‌మెంట్ మార్చాలని కోరారు.

ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేసుకుంటున్న భక్తురాలు

ఆలయ ప్రాంగణంలో భక్తులు

రాజన్న ఆలయానికి కార్తీక శోభ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- పెద్ద సంఖ్యలో తరలిన ప్రజలు

వేములవాడ టౌన్, నవంబర్ 3 : వేములవాడ రాజన్న సన్నిధి కార్తీక శోభ సంతరించుకున్నది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. ముందుగా భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి, స్వామి వారిని దర్శించుకొని, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. పెద్దసేవలు, కల్యాణాల మొక్కులు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. దాదాపు 50 వేలకుపైగా భక్తులు స్వామివారిని దర్శించున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.26 లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు. రాజన్న అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ, భీమేశ్వరాలయం, నాగేశ్వరాలయాల వద్ద కూడా భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై అంజయ్య పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దీపారాధన చేస్తున్న భక్తులు

గజసింగవరంలో ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న కలెక్టర్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

గంభీరావుపేట, నవంబర్ 3 : కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తూకం వేసి, రైస్‌మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదేశించారు. మండల కేంద్రంతో పాటు ముస్తాఫానగర్, గోరంటాల, గజసింగవరం, రాజేశ్వర్‌రావునగర్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలును ఆదివారం ప్రారంభించారు. ధాన్యాన్ని కేంద్రానికి తీసువచ్చిన రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సివిల్ సప్లయి అధికారులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, సీఈవో రాజిరెడ్డి, నిర్వాహకులు, అధికారులు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రుద్రంగి, నవంబర్ 3 : సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్ యాదగిరి సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా మొదటి విడుత హౌస్ లిస్టింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే హౌస్ లిస్టింగ్ ప్రక్రియను డిప్యూటీ తహసీల్దార్ యాదగిరి, ఆర్ఐ నవీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో యజమానులతో మాట్లాడుతూ సర్వే వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్యూమరేషన్ బ్లాక్ నంబర్ 0017/బీ సందర్శించి ఎన్యూమరేటర్‌కు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఎన్యూమరేటర్స్‌తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నమిలిగుండుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ తిరుపతిరెడ్డి

వేములవాడ రూరల్, నవంబర్ 3 : ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని వేములవాడ ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, చెక్కపల్లి, నమిలిగుండుపల్లి గ్రామాల్లో వేములవాడ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యంను కొనుగోలు చేస్తామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు సహకార సంఘాలు అండగా ఉంటాయన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తూం కాంతరావు, డైరెక్టర్‌లు సంజీవరెడ్డి, తోట రాజు, సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వకుళభరణం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మహేశ్, మల్లేశం, శ్రీనివాస్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పదిరలో కొనుగోళ్లు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆదివారం నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న డీఎస్‌వో వంసతకుమారి హామీ మేరకు.. రైతులు శాంతించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో పాటు అధికారులంతా పదిర గ్రామానికి చెరుకొని వెంటనే హడావుడిగా కాంటాలు ప్రారంభించి కొనుగోలు చేశారు. తహసీల్దార్ రామ్‌చందర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి కొండూరి పరామర్శ

నివాళులర్పిస్తున్న కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, నవంబర్ 3: మండలంలోని గోరంటాల మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎర్రం అంజిరెడ్డిని ఆదివారం నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. అంజిరెడ్డి తల్లి రామవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, దశ దినకర్మకు కొండూరి హాజరయ్యారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, బాల్‌రెడ్డి, గడ్డి హరీశ్, ఎడబోయిన రాజు, బండ రమేశ్, అంజిరెడ్డి తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

గూడెంలో ఘనంగా పోచమ్మ బోనాలు..

గూడెంలో పోచమ్మ బోనాలు తీస్తున్న మహిళలు

ముస్తాబాద్, నవంబర్ 3 : మండలంలోని గూడెంలోని పోచమ్మ ఆలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పోచమ్మ తల్లికి బోనాలు తీసి, సమర్పించారు. పిల్లాపాపలు సల్లంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

అవసరమైన వారికి ఇసుక పర్మిషన్ ఇవ్వాలి

ఇల్లంతకుంట, నవంబర్ 3 : అవసరమైన వారికి ఇసుక పర్మిషన్ ఇవ్వాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా ఇంటి నిర్మాణం, మౌలిక వసతులు నిర్మాణం కోసం ఇసుక అవసరమైన వారికి రెవెన్యూ, పోలీస్ అధికారులు పర్మిషన్ ఇవ్వాలని కోరారు. ఐదు నెలలుగా ఇసుక రవాణా లేక పోవడంతో అత్యవసర నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయని పేర్కొన్నారు. అప్పుడప్పుడు అక్రమంగా నడుస్తున్న ఇసుక ద్వారా అధిక ధరలు చెప్పడంతో నిర్మాణాలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇసుక పర్మిషన్ ఇవ్వాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 3 : మండల కేంద్రంలోని లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసినట్లు బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఐదుగురు లబ్ధిదారులకు రూ. 71,500 చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కేడీసీసీ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ఎల గందుల అనసూయ నర్సింలు, సొసైటీ డైరెక్టర్ నేవూరి వెంకట నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మీసం రాజం, పందిర్ల పర్శరాములు, రమేశ్, బాలాగౌడ్, శ్రీనివాస్, దేవేందర్, అజీముద్దీన్, గుండాడి వెంకన్న, శివరామకృష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

సిరిసిల్ల టౌన్, నవంబర్ 3: ఆరు గ్యారెంటీల హామీని అమలు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. ప్రజా సంక్షేమానికి గాలికి వదిలిన రేవంత్‌రెడ్డి ప్రజా నాయకుడు కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తానని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ చెరిపేస్తే చెరిగిపోయేందుకు సామాన్య వ్యక్తి కాదని ప్రజల గుండెల్లో నిలిచిన మహానాయకుడని అభివర్ణించారు. ఈ సమావేశంలో మట్టి శ్రీనివాస్, కోడం వెంకటేశ్, అనీల్‌గౌడ్, మూడం సాయి, దేవరాజు, కస్తూరి సాయి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

రోడ్డుపై దీక్ష చేస్తున్న గ్రామస్తులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

వీర్నపల్లి, నవంబర్ 3 : మండలంలోని అడవిపదిరలో నిలిచిన వంతెన నిర్మాణం చేయాలని గ్రామస్తులు రోడ్డుపై దీక చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు జాలపల్లి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారని తెలిపారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలోనే అపేశారని పేర్కొన్నారు. వంతెన నిర్మాణ పనులు నిలిచి మూడు నెలలు గడుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడన్నారు. గ్రామంలోకి వెళ్లడానికి కనీసం అప్రోచ్ రోడ్డు కూడా వేయాలేదన్నారు. మూడు కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి గ్రామంలోకి వెళ్లడానికి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి లారీలు రాలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి, వంతెన ప్రక్కన తాత్కాలిక రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. సాయంత్రం దీక్షను విరమించారు. మల్లయ్య, రవి, రాజం, శంకర్, అంజనేయులు, రామచంద్రం, సుదర్శన్, బాలకిషన్, నరేశ్ తదితరులు ఉన్నారు.

బీసీ యువజన పట్టణ కమిటీ నియామకం

నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు వినోద్

వేములవాడ, నవంబర్ 3 : వేములవాడ పట్టణ బీసీ యువజన విభాగం కమిటీని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా మంత సందీప్, ఉపాధ్యక్షుడిగా లింగం రాకేశ్, ప్రధాన కార్యదర్శిగా బొజ్జ నిశాంత్, కార్యదర్శిగా సాయికృష్ణ, జెయింట్ సెక్రటరీగా రేగుల నరేశ్, కార్యవర్గ సభ్యులుగా నితీశ్, సంపత్‌ను నియమించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్

సిరిసిల్ల రూరల్, నవంబర్ 3 : మండలంలోని గోపాలరావుపేటకు చెందిన సగ్గుపాటి వినోద అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు రామ్మోహన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు సాయం ఆదివారం అందజేశారు. గుండు ప్రేమ్ కుమార్, రమేశ్, బాబు, బాలయ్య, నర్సయ్య ఉన్నారు.

పవర్‌లూం కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలి

పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

మాట్లాడుతున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

కలెక్టరేట్, నవంబర్ 3 : పవర్‌లూం కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పిస్తేనే ఆత్మహత్యల నివారణకు సాధ్యపడుతుందని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ అన్నారు. వర్కర్ టూ ఓనర్ షెడ్లను సెస్ సంస్థకు, వడ్ల గోదాములకు యజమాలకు కేటాయించొద్దని నేడు సోమవారం చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో పవర్లూమ్ అనుబంధ రంగాల నాయకుల సమావేశం సిరిమల్ల సత్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ కార్మికుల కోసం కట్టిన షెడ్లను కార్మికులకే కేటాయించాలని చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పవర్లూమ్ కార్మికులు వార్పింగ్ వైపని జాఫర్ అనుబంధ రంగ కార్మికులందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఒగ్గు గణేశ్, రమేశ్, ఉడుత రవి, దోమల రమేశ్, సత్యం, శ్రీకాంత్, పోచమ్మ పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

రైస్ మిల్ ప్రారంభోత్సవంలో రవీందర్‌రావు

గంభీరావుపేట, నవంబర్ 3 : అత్యాధునిక హంగులతో రైస్‌మిల్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, ప్రాంత రైతులకు మెరుగైన సేవలు అందించాలని నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసుకున్న జానకీ రామ రైస్‌మిల్ ప్రారంభోత్సవంలో కొండూరి పాల్గొన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, మాజీ సర్పంచ్ శ్రీధర్, ఆయా రైసు మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలి

చందుర్తి, నవంబర్ 3 : ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పోసిన ధాన్యం కుప్పలను పరిశీలించారు. వరి పంట చేతికొచ్చి నెలరోజులవుతున్నా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాంటాలు పెట్టి ధాన్యం తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లకు అలాట్మెంట్ ఇవ్వకపోవడంతో దళారులు దోచుకుంటున్నారన్నారు. ధాన్యం కొనుగోలు వెంటనే లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్తీక దీపోత్సవానికి రావాలని ఆహ్వానం..

ఆహ్వానిస్తున్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ టౌన్, నవంబర్ 3 : కార్తీక మాసం సందర్భంగా రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవానికి ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆహ్వానించారు. దేవాదాయ శాఖ వారి ఆదేశాల మేరకు.. రాజన్న ఆలయ ప్రాంగణంలో సామూహిక దీపోత్సవం సందర్భంగా నిర్వహించబడే సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరుకావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వారి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ప్రధానార్చకులు చంద్రగిరి శరత్, తమ్మళి అర్చకులు వెంకన్న, పర్యవేక్షకులు వరి నర్సయ్య, అకౌంట్స్ అడ్వైజర్ ఆగమరావు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

బోయినపల్లి, నవంబర్ 3 : మండలంలోని మర్లపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు భీంరెడ్డి మహేశ్వర్‌రెడ్డిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం పరామర్శించారు. వారం రోజుల క్రితం మర్లపేటకు చెందిన భీంరెడ్డి మహేశ్వర్‌రెడ్డికి చెతికి దెబ్బ తగిలి చికిత్స పొందుతూ ఇంటి వద్ద ఉండగా, ఆయనను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు రవీందర్, ఏఎంసీ చైర్మన్ ఏల్లేశ్ యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు ఉన్నారు.

ఆశ్రమంలో యాదగిరిరావు పుట్టినరోజు వేడుకలు

గంభీరావుపేట, నవంబర్ 3 : మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు గండ్ర యాదగిరిరావు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో మా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మల్లుగారి నర్సాగౌడ్, గ్రామస్తులు సుధాకర్‌రావు, కరుణాకర్‌రావు, దేవానందం, అనిల్, రవి, ప్రశాంత్, ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

వేములవాడ, నవంబర్ 3 : వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో ఆదివారం వీధి కుక్కలు దాడి చేయడంతో చిన్నారులు గాయపడ్డారు. కాలనీలో చేని మహర్షి, మామిండ్ల రుత్విక్, రాణా చిన్నారులపై దాడి చేశాయి. స్థానికులు వారిని ఏరియా దవాఖానకు తరలించారు.

గాయపడిన చేని మహర్షి

డెయిరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

స్తంభంపల్లిలో పాల డెయిరీని ప్రారంభం

బోయినపల్లి, నవంబర్ 3 : మండలంలోని స్తంభంపల్లిలో కరీంనగర్ పాల డెయిరీని ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఇప్పటి వరకు స్తంభంపల్లి పాల డెయిరీ లేక పోగా, నూతనంగా కరీంనగర్ పాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు ఈ పాల ఉత్పత్తి దారుల సంఘంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా డెయిరీ చైర్మన్ చల్మెడ రాజరాజేశ్వర్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కోట్టాపల్లి సుధాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, కాంగ్రెస్ నాయకులు పూస రవీందర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఏల్లేశ్ యాదవ్, రవీందర్, లక్ష్మీరాజం, కనకయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వీర్నపల్లి, నవంబర్ 3: మండలంలోని మద్దిమల్ల బంజేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ వైస్ చైర్మన్ లెంకల లక్ష్మణ్ అదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తిరుపతియాదవ్, డైరెక్టర్ శ్రీనివాస్, దేవయ్య, నరహరి,చంద్రమౌళి ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

వేములవాడ, నవంబర్ 3 : వేతన ఒప్పందం అమలు చేయని యజమానులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మరమగ్గాల కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆది శ్రీనివాస్‌కు వివరించారు.

సర్వేతో బోధనకు అటంకం..

వీర్నపల్లి, నవంబర్ 3 : కులగణన సర్వేతో ఉపాధ్యాయుల బోధనకు అటంకం కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలను ఒక పూట మూసివేయాలని అదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. నూతన ఉపాధ్యాయుల నియామకంతో ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న తరుణంలో ప్రైమరీ టీచర్లకు విధులు కేటాయించడం సమంజసం కాదని తెలిపారు. అక్టోబర్ 30న ఉప ముఖ్యమంత్రితో ఉపాధ్యాయ సంఘాలు సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం సర్వే చేస్తే ఉపయోగం ఉండదని, పాఠశాలలకు అంతరాయం కలగకుండా విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

వేములవాడ రూరల్, నవంబర్ 3 : ప్రాథమిక పాఠశాలలను ఉదయం ఒంటి గంట వరకే నడిపిస్తే విద్యార్థుల చదువులకు ఇబ్బంది పడుతారని పీఆర్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ మండల పరిషత్ ఆవరణలో పీఆర్టీయూ నాయకులు మాట్లాడుతూ జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా పిలుపుమేరకు.. పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్ మేరకు జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మాత్రమే కుల గణన చేయడం కోసం ప్రాథమిక పాఠశాలలను ఉదయం ఒంటి గంట వరకే నడిపించాలనడం సరికాదన్నారు. మరోసారి పునసమీక్ష చేయాలని పీఆర్టీయూ నాయకులు విన్నవించారు. పీఆర్టీయూటీఎస్ అసోసియేట్ అధ్యక్షుడు చిప్ప యాదగిరి, పులి రాజ్‌గౌడ్, మహేశ్, కిరణ్‌కుమార్, మధుకర్, శ్రీనివాసాచారి ఉన్నారు.

ఐక్యతతో ఆలయాన్ని పూర్తి చేసుకుందాం

చౌడాలమ్మ ఆలయ పనులు ప్రారంభిస్తున్న దేవేందర్‌యాదవ్, సభ్యులు

గంభీరావుపేట, నవంబర్ 3: సభ్యులందరూ కలిసి ఐక్యతతో ఉంటూ అమ్మవారి ఆశీస్సులతో ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు కొక్కు దేవేందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని సముద్రలింగాపూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న చౌడాలమ్మ ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవేందర్‌యాదవ్ హాజరయ్యారు. అనంతరం సంఘ సభ్యులతో కలిసి వారు నిర్మాణ పనులను ప్రారంభించారు. సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి, సంఘ సభ్యులు మహేశ్‌యాదవ్, మల్లయ్యయాదవ్, శిర్రం అంజయ్య, రాములు, మహేశ్, భూమయ్య, సభ్యులు ఉన్నారు.

గొర్రెలకు గాలికుంటు నివారణ టీకాలు

ఇల్లంతకుంట, నవంబర్ 3 : మండలంలోని తిప్పాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం పశువైద్య సిబ్బంది, గోపాల మిత్ర సిబ్బంది సహాయంతో గొర్రెలకు, మేకలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గొర్రె, మేకల పెంపకం దారులు తమ జీవాలకు టీకాలను తప్పకుండా వేయించుకోవాలని సూచించారు.